# హనీమూన్

## సత్యవాడ సోదరీమణులు

1986 దీపావళి కథలపోటీలో సాధారణ ప్రచురణకి ఎన్నికైన కథ

శ్యామ్ ఆఫీసుకు వెళ్ళేసరికి అతని సహఉద్యోగులంతా తీవ్రంగా వాదోపవాదాలు చేసుకుంటున్నారు. అంతా సీతాపతిని చుట్టుముట్టి ఏదో గొడవచేస్తున్నారు. 'అరే! ఇవేళ వీడు ఇలా దొరికిపోయాడే! కారణం ఏమిటబ్బా? ' అనుకున్నాడు.

"ఏరా! పతీ! ఏమిటి సంగతి?" మిత్రుల్లో అడిగేశాడు.

"చూడరా! వీళ్ళంతా ఊరికే నన్నాటపట్టిస్తున్నారు". మిత్రుడు తన పక్షమైనందుకు పొంగిపోతూ చెప్పేడు.

"అలా కొట్టిపారేస్తే ఊరుకుంటామా? శ్యామ్ గాణ్ణే చెప్పమను న్యాయమేమిటో"- వాళ్ళలో ఒకడు చొరవగా అన్నాడు.

"వీడు మనకి పార్టీఇవ్వడం తప్పించుకుంటున్నాడురా! మనవాళ్ళు తీసేయకుండానే గుప్‌చుప్‌గా అత్తవారింటికి చెక్కేస్తున్నాడు..."అలా మరొకరు అనేసరికి విషయం బోధపడిపోయింది శ్యామ్‌కి.

"ఓరినీ! ఇంతేనటరా! ఏంముంచుకొచ్చిందో అని హడలిపోయాను. ఇంతకీ మన పతిగాడు అమాయకుడ్రా! వాడిని ఒదిలేద్దాం. శ్రీమతిని తీసుకొచ్చేక సరాసరి ఇంటిమీదే దాడి చేద్దాం"- శ్యామ్ మాటకి అంతా ఒకేసారినవ్వటం ఆపైన ఎవరిపనిలోవారు లీనం కావటం జరిగిపోయాయి. శ్యామ్ మాత్రం పనిలో పూర్తిగా నిమగ్నం కాలేకపోతున్నాడు. అతని మెదడులో ఆలోచనలు జోరీగల్లా రొదచేస్తున్నాయి.'ఏదాది క్రితమే బ్రహ్మచర్యానికి వీడ్కోలుయిచ్చిన పతి ఇప్పుడు నాన్న. అందుకు పార్టీఅడిగితే జిడ్డుమొహం పెట్టేదేమిటి? తను పతిగాడిపక్షమై కొలీగ్స్ అల్లరినుంచి తప్పించే సాడు. కాని తప్పు పతిగాడిదే. ఆ మోస్తరుఛాన్సు తనకే వరిస్తే ఎగిరిగెంతులు వేయడూ? ఎవరిచేతా అడిగించుకోకుండానే మిత్రబృందమంతటికీ గ్రాండ్ పార్టీ ఇచ్చేయ్యడూ? తనకా శుభఘడియ ఎప్పుడో?' శ్రీమతి చేతి వంట కమ్మగా కడుపారా ఆరగించి వచ్చినా నిస్సత్తువ ఆవరించింది. పైన ఫేను ఫుల్‌స్పీడ్‌లో తిరుగుతున్నా శ్యామ్‌కి చెమటలుపట్టాయి. ఆ 'అదృష్టం, ఆనందం తనకింకా దూరంలోనే ఉండిపోయాయి. తమ, స్వర్ణ సగం సగమయి కలిసిపోయి నాలుగేళ్ళు గడచిపోతున్నాయి. అయినా తామిద్దరూ ఇలా స్వర్ణకోరిక తీరేవరకూ కొత్త జంటలా...' నిట్టూర్చేడు. 'మరీ విడ్డూరం స్వర్ణకోరిక! లేకపోతే హాయిగా అమ్మఅయి, తమ అనురాగదీపాన్ని కాంతివంతం చేసి పరవశించదూ? 'మమ్మల్ని నాన్నుచేసేసేను మాసేరా? శ్రీవారూ!' అంటూ పసికందును తనకందించి మురిపించదూ?' ఓ చిలిపిపరదా...... విచిత్రమైన కోరికగామారింది స్వర్ణలో. ఇంతింతై అంతంతై అన్నట్లు కోరిక వేళ్ళు నాటుకుపోయి, ఆమెకు కాస్త మొండితనాన్ని తెచ్చిపెట్టింది. 'ఇంట్లో ఒక పంటిపాప లేకపోతే నీకుమాత్రం ఏం తోస్తుంది? నేను ఆఫీసుకు వెళ్ళిపోయాక ఒకదానివే ఉండాలిగా' అంటూ భర్త ఆమె మనస్సు మార్చడానికి చెప్పినా చెవిపెట్టలేదు. ఆమె పంతం అలాంటిది.'తన పెళ్ళినాడు స్నేహితురాళ్ళతో అన్నదేమిటి? పెళ్ళయిపోగానే శ్రీవారితో బెంగుళూరు, మైసూరు, హనీమూన్ చెక్కేస్తాను. వాళ్ళుమాత్రం ఎన్నిరకాలుగా పరిహాసంచేసేరు? నేను అలా అనేసరికి.

'ఇవన్నీ బాధ్యతలు మీదపడేదాకా చెప్పేకబుర్లే. సామాన్యుల పరదాలు తీరేది ఊహలోకాల్లోనే' సీత పెద్ద ఆరిందాలా జీవితాన్ని కాచి ఒడబోసినట్లు అంది.

'ఇదిగో అదిగో అంటూనే దాటేస్తారు. కాస్త వాయిదావేస్తే చాలు అమ్మవై కూర్చుంటావు. చెట్టాపట్టాలూ లేవు హనీమూన్‌లూ లేవు' సీత మాటను మరింత ధృవపరిచింది సుగుణ. కబుర్లమధ్య యథాలాపంగా దొర్లిన ఆమాటలు స్వర్ణలో పట్టుదల పెంచాయి.'ఈ స్వర్ణ అంత బేల కాదు. అంత సులువుగ పరిస్థితులకు లోబడదు. తొలికలయికలోనే శ్రీవారికి తన కోరిక వెల్లడిస్తుంది. దానిని అతడు ఎంతకాలం వాయిదా వేస్తే తను తల్లి కావటాన్ని అంతకాలం వాయిదా వేస్తుంది. ఈ స్వర్ణ మాటంటే మాటే!' తన కొంటెతనాన్ని చూచి అప్పుడు వాళ్ళంతా నవ్వుకున్నారు. కాని ఇప్పటికీ తను ఆపంతం విడిచిపెట్టలేదు. శ్రీమతి పట్టుదల శ్యామ్‌ని కలవరపెడుతూనే ఉంది.'తను ఎలాగైనా స్వర్ణ పట్టుదల నెరవేర్చాలి. అందుకు తను చేయవలసిందల్లా ఒక్కటే. హనీమూన్ ట్రిప్పుకు సరిపోయేటంత డబ్బుకూడ బెట్టడం. రెండేళ్ళుగా ప్రయ

### అలల కుక్కలు

అరిచి విరుచుకుపడే అరక్షక కాలభైరవాలు అలలు
కాపున్నాయి ముసలి సముద్రుడి సామ్రాజ్యానికి
ఎవరూ దగ్గిరికి చేరకుండా, ఏదీ దోచుకుపోకుండా.
మనిషి దొంగ సంగతి గుడ్డి సముద్రుడికి తెల్సినట్టు లేదు!
అలల కుక్కలు అహోరాత్రాలు అరుస్తూనే వున్నాయి
అడ్డూ, ఆపు లేకుండా సముద్ర సంపద గల్లంతవుతూనే వుంది.

-ఎ.వి. రెడ్డి శాస్త్రి

త్నిస్తూనే ఉన్నాడు. నిత్యావసరాలకు సరి పోయే నిరుద్యోగి సంపాదనతో హనీమూన్...ప్రయాణం ఏమిటో!! శ్రీమతి పట్టుదల? తను ఓవర్ టైం చేసి, ఇంకా కాస్త టైం మిగిలితే టైపుచేసి...డబ్బు పోగుచేస్తూనే ఉన్నాడు. అది స్వర్ణకు తెలియనివ్వకుండా బ్యాంకులో దాచి పెడుతున్నాడు. ఇంకెంతలే, త్వరలోనే తను భార్య కోరిక తీర్చేస్తాడు. అప్పుడు తండ్రి అయి ఆనందమంతా అనుభవించేస్తాడు...!'శ్యామ్ మనస్సు తేలికపడింది. హుషారుగా రోజులు గడుపుతున్నాడు.

"రేపు శెలవు పెట్టండి, ఆఫీసుకి"

"ఎందుకట?" భార్య కళ్ళలోకి అల్లరిగా చూస్తూ.

"తెలీదేం? పాపం! మన పెళ్ళయి రేపటికి నాలుగేళ్ళు పూర్తవుతాయి. అంతాతెలిసే నాచేత చెప్పించాలని!"

"చెప్పించటమే కాదు. రేపటికి నీకేం మంచి బహుమతి కావాలో అడిగేయ్. చప్పున ఇచ్చేస్తా" ఆమె ముంగురులు తన మునివేళ్ళతో సవరిస్తూ అన్నాడు.

"అడిగి పుచ్చుకొనేది బహుమతి అనిపించు కుంటుందా? మీకు మీరుగానే ఇవ్వండి"

"అమ్మో! జాణవే సుమా! అయితే సరే! రేపే చెబుతా నీకో మంచిమాట. ఇక్కడ కాదు. నీ ఆజ్ఞ ప్రకారం రేపు శెలవు పెట్టి మనం సింహాచలం వెళుతున్నాంగా. అక్కడ, సంపెగల గుబాళింపుల్లో!"


స్వర్ణకు సిగ్గు ముంచుకొచ్చింది. వంటింట్లోకి తుర్రుమంది. నెమ్మదిగా పెట్లోనుంచి బ్యాంకు పాస్ బుక్ తీసి తాను దాచిన మొత్తాన్ని చూసుకున్నాడు. శ్యామ్ కళ్ళు తృప్తితో మెరిసాయి. 'ఇన్నాళ్ళకి-కాదు కాదు ఇన్నేళ్ళకి ఈ సగటుమనిషి తను అనుకున్నది సాధించగలుగుతున్నాడు. మధ్యతరగతి మామూలు మనిషి సాధించగలుగుతున్నాడు. శ్రీమతి కోరిక తీర్చి తను తండ్రి అయితే అమ్మ మనోవేదన మాయమవుతుంది!'తల్లిరూపం మనసులో మెదలగానే అతని కళ్ళల్లో ఆనంద బాష్పాలుచిందాయి.

'మనవడి కోసం అమ్మ ఎంత తపించిపోతోంది. ప్రతి ఉత్తరంలోనూ 'ఏమ్రా విశేషం రాయరూ' అంటూ రాసుకొస్తుంది. ఇక తనూ, స్వర్ణఅయితేమౌనం వహిస్తుందిగానీ, తన మనస్సు మాత్రం అమ్మ ఆశయం తీర్చలేనందుకు భారంగా మూల్గుతుంది. ఇంతవరకూ తీరని అమ్మ కోరిక ఇకపై భగవదనుగ్రహం తో తీరిపోతుంది!' స్వర్ణ పిలవడంతో పుస్తకాన్ని మళ్ళీ భద్రంగా దాచేసి వంటింట్లోకి వెళ్ళేడు.

మరునాడు ఆ యువజంట ఎంతో ఉత్సాహంగా ఉంది. స్వర్ణ కొత్తచీరలో కొత్తగా మెరిసిపోతోంది. భర్త కళ్ళకి, స్వర్ణకి శ్యామ్ కొత్త పెళ్ళికొడుకులానే కనిపిస్తున్నాడు. కాఫీ, టిఫిన్ కానిచ్చి ఉభయతారకం అన్నట్టు సింహాచలం బయలుదేరారు. బస్సు ఆగగానే "స్వర్ణా! ఈ రోజు దేముడిని ఏమి కోరుకోవాలో తెలుసా!"

"అదీ మీరే చెప్పాలా! మనం ఎప్పుడూ ఇలా అన్యోన్య అనురాగాలతో ఉండాలని..."

"అదేంకాదు. మనమధ్యకు ఓ బుజ్జిగాడిని..."



శ్యామ్‌వైపు కోపంగా చూసింది స్వర్ణ. "ఇందుకా ఈ మురిపెమంతా. నన్ను కాస్త ఆనందంలో ముంచి మీ కోరిక తీర్చేసుకుందాం అనుకుంటున్నారు. అదేం కుదరదు. కాలం తరిగిపోయినా నాకలలు కరగనివ్వను" ధృడంగా అంటున్న భార్య చేతిని మృదువుగా పట్టుకున్నాడు.

"నన్నేం బతిమాలనక్కర్లేదు" స్వర్ణ అతని చేతిని విదిలించుకుంది.

కొంటెగా నవ్వుతూ "దేవిగారు ఇంత ఆగ్రహంలో ఉంటే యెలా? నేను చెప్పేతీయని మాట ఏంకావాలి?"

"ఏమయితే కానివ్వండి. నాకోరికను మాత్రం సడలనివ్వను, చెప్పేగా!"

"అయితే అది తీరే రోజు చాలా దగ్గరలోనే!"

స్వర్ణ ముఖంలో ఆశా ఆనందం చిందులువేసాయి.

"ఏమిటి? మన హనీమూన్ ప్రయాణమా? ఎలా? తొందరగా చెప్పండి." చేయి తనందుకుంటూ ఆత్రంగా అడిగింది.

"అబ్బా! ఇంతసేపూ సత్యభామనయ్యావుగా! ఆగు! ఇక కాస్సేపు నిన్ను ఉడికించే ఛాన్సునాది. దేముడ్ని చూసి, నేను చెప్పిన ప్రకారం నువ్వు ఆస్వామిని కోరుకుంటేనే...బిగిసిన పిడికిలి విడి రహస్యం వెలువడేది".

"మీ చమత్కారంతో నన్ను చంపుతున్నారు. అలాగే కానివ్వండి. అది మాత్రం ఎంతసేపు కనుక"- మళ్ళీ ఇద్దరూ మెట్లపై కూర్చొని ప్రసాదాన్ని ఆరగిస్తున్నప్పుడు ఆప్రస్తావనే వచ్చింది.

"ఇక చెప్పేస్తాలే. పాపం నిన్నెందుకు ఊరించటం" స్వర్ణ జడలో సంపెంగలు తురుముతూ కొంటెగా అన్నాడు శ్యామ్. స్వర్ణకి ఏదో తీయని అనుభూతి ఆవరించింది. ముగ్ధమోహనంగా భర్త కళ్ళలోకి చూస్తూ అలానే ఉండిపోయింది. శ్యామ్ తన జేబులోని భద్రపరిచిన బ్యాంకు పుస్తకాన్ని స్వర్ణ చేతుల్లో ఉంచాడు.

ఆరోజంతా తీయగా, నిజంగా తొలిరోజులాసే ఒక మధురిమలా కరగిపోయింది ఇద్దరికీ.

"అప్పుడే మనం వేసవిలో అడుగుపెడుతున్నాం. తొందరగా టికెట్లు తీసుకోండి. ఆఫీసుకి శెలవు పెట్టండి" మరునాడు తెలవారుతుంటేనే పతిదేవుడిని ఆదేశించింది.

"అలాగే ప్రియా. నాకు మాత్రం మనిద్దరం సరదాగా జీవితాంతం గుర్తుండేలా గడపాలని లేదూ? నేనూ ఈ సమయం కోసం ఎదురుచూడకపోలేదు. నీకోరిక మన ఇద్దరికీ ఒక ప్రణయ మధురిమలా ఎప్పుడూ గుర్తుండి పోవాలి సుమా! మనం ముసలివాళ్ళమైపోయినా ఈ అనుభవం మనలను గిలిగింతలు పెట్టాలి!"

ఆమె మనస్సు ఆనందలోకాల్లో తేలిపోతోంది.'ఈ



Innovation/PP/TL/1

తరుణం కోసం తనెంత ఎదురుచూసిందని! అసలు తన కోరిక నెరవేరనిదిగానే ఉండిపోతుందేమోనని అప్పుడప్పుడు భయం కూడా కలిగేది. ఎప్పుడూ శ్యామ్ తన మనస్సుని మళ్లించటానికి పదే పదే ప్రయత్నం చేసేవాడు. తను ఇంత మంకుపట్టు పట్టకపోతే ఇద్దరి పిల్లల తల్లి అయ్యేదేమో ఈ పాటికి. నిజంగానే తనకిప్పుడు విజయగర్వంగా ఉంది!'ఆక్షణం నుంచీ ఒక్క నిముషం కూడా కాలాన్ని వృథాచెయ్యలేదు స్వర్ణ. మధ్యాహ్నం వేళ నిద్రపోవటం, పుస్తక పఠనంలో కాలాన్ని కరగించటం అన్నీ మానేసింది. ఇరుగుపొరుగులతో పిచ్చాపాటీ వేసుకున్నా, టి.వి.చూడటానికి పక్కింటికి వెళ్ళినా సమయం వృథా అయిపోతుందనిపించేది. తన మిత్ర బృందానికి సగర్వంగా జరగబోయే తన హనీమూన్ ట్రిప్పును గురించి రాసేసింది. తను ఓ నెల రోజులు ఇంట్లో లేకపోయినా వేసవి వెళ్ళిపోతుందని ముందుగానే అప్పడాలు, ఒడియాలు అన్నీ తయారు చేసేసుకుంది. తను ఊళ్ళోలేనప్పుడు ఇల్లు ఏమాత్రం అశుభ్రంగా ఉండకూడదని, హనీమున్ ట్రిప్పు పూర్తి చేసుకొని తలుపులు తెరిచేసరికి అందాలొలుకుతూ స్వాగతం ఇవ్వాలని ఇంటిని నీటుగా అలంకరించుకుంది. శ్యామ్, తనబట్టలు అన్నీ ఉతికి ఇస్త్రీలుచేసి పెట్లో పదిలపర్చుకుంది.

"అబ్బా! ఎన్ని పనులని. క్షణం తీరిక ఉంటేనా" శ్రీమతిలోని ఈ ఉత్సాహాన్ని చూస్తున్న శ్యామ్‌కి ఆశ్చర్యం కూడా కలుగుతోంది. 'ఈ ఆనందమంతా హనీమున్ వెళ్ళడం కోసమే! ఇక కోరిక తీరినప్పటి సంతోషాన్ని అసలు పట్టగలదా. పిచ్చిస్వర్ణ! ఆనందంలో ఉక్కిరిబిక్కిరి అవుతుందేమో' అనుకుంటూనే టికెట్టు రిజర్వేషను చేసేసాడు శ్యామ్.

ప్రయాణం రేపే. ట్రయిన్‌లో తినటం కోసం హడావిడిగా ఎన్నో ఫలహారాలు చేసింది.'ఇక రేపట్నుంచీ తన శ్రీవారితో!..'ఎంచక్కా ఊహల్లో తేలిపోతున్న స్వర్ణకి ఓకవరు అందించి వెళ్ళాడు పోస్టుమన్. ఆ ఉత్తరం అత్తగారి దగ్గరనుంచే కావటంతో విప్పి చదివింది. ఆమె గుండెలు దడదడలాడేయి. చిరుగాలికి తల ఊపుతూ పులకించే చిన్నారి తరువు ఆ చిరుగాలే ఒక్కసారిగా సుడిగాలిగా మారితే గజగజలాడినట్టు నిలువునా కంపించిపోయింది.

మరొకసారి ఉత్తరాన్ని చదువుకున్న స్వర్ణమెదడు మొద్దుబారిపోయింది. ఆ ఉత్తరాన్ని గంటల తరబడి చేతుల్లో ఉంచుకొని అలానే కూర్చుండిపోయింది. గడియారం నాలుగు కొట్టడంతో అదిరిపడింది.'ఇంకేముంది. శ్రీవారు వచ్చేస్తారు. ఈ ఉత్తరం చూస్తారు. తన ప్రయాణం మరో వైపు మారుతుంది. తన ఆశలన్నీ నిరాశలవుతాయి. ఇంతవరకూ వచ్చేక తీరని తన కోరిక ఇంకెప్పటికి తీరుతుందని ఆశించాలి. ఐదేళ్ళుగా తనిలా ఎంతో పట్టుదలతో ఉన్న ఈ విషయాన్ని ఇంతటితో మరచిపోవటమేనా?'స్వర్ణకి దుఃఖం ముంచుకొచ్చింది. భోరున ఏడవాలనిపించింది. స్నేహితురాళ్ళంతా తన చుట్టూచేరి పరిహసిస్తున్నట్టు అనిపించింది. 'వాళ్ళకి తన హనీమూన్ ట్రిప్ గురించి గొప్పగా ఉత్తరాలు కూడా రాసేసింది తనేదో ఘనవిజయాన్ని సాధించినట్టు. వాళ్ళన్నదే నిజమవుతుందా? తనకోరిక నెరవేరదా? తను ఓటమిని అంగీకరించవలసిందేనా? వీల్లేదు. అలా జరిగితే ఇన్నేళ్ళ తన పట్టుదల వృథా అయిపోతుంది. ఈ జన్మకిక తనకోరిక తీరే అవకాశమే రాదు!'స్వర్ణ తీవ్రంగా ఆలోచించి ఆ ఉత్తరాన్ని శ్రీవారి కంటికి అందని ప్రదేశంలో దాచేసింది. ముఖాన్ని పౌడరుతో పాటు చిరునవ్వు కూడా పులుముకొని ఆఫీసు నుంచి వచ్చిన శ్రీవారికి స్వాగతమిచ్చింది.

హుషారుగా ఈలపాటలు పాడుతున్నాడు శ్యామ్. 'అతని కళ్ళల్లో ఎంతటి ఆనందం! పెళ్ళైన తొలిరోజులలో చూసిన సంబరం, సరదా ఇప్పుడు అతనిలో చూడగలుగుతోంది. అంటే ఈ హనీమూన్ సరదా తన కంటే అతనికే ఎక్కువ ఉందేమో!'ఆలోచిస్తూనే కాఫీ, టిఫిను అందించింది. గలగలా కబుర్లు చెబుతూ అతనని కాని స్తున్నాడు. "స్వర్ణా! ఇన్నాళ్ళకి మనమిద్దరం ఎంతో అపురూపమైన ఆనందాన్ని పొందబోతున్నాం కదూ? నువ్వు మన హనీమూన్ ట్రిప్పు గడపాలని కోరుకున్న ప్రదేశాలు ఎంత సుందరమైనవో! మనల్ని మనం మరచిపోలేని జీవితంలోని మాధుర్యాన్నంతా ఒక్కసారి చవిచూచే మధురమైన రోజులు నిజంగా ఎప్పటికీ మరచిపోం. ఇవే మన జీవితంలో తీపి గుర్తులు! ఏమంటావ్" అతని మాటల్లో పారవశ్యం ఉంది. స్వర్ణ నిరుత్తరాలై అతని ముఖంలోకి చూస్తూ ఉండిపోయింది.

'నిజంగానే తను అనుకున్నట్టు ఆనందం లో ఉక్కిరిబిక్కిరి అవుతుందేమో స్వర్ణ- ఏమీ బదులాడలేకపోతోంది. ఉత్త అమాయకురాలు. పేల!'ఆప్యాయంగా భార్యను హృదయానికి హత్తుకున్నాడు శ్యామ్.


దంపతులు

మొదట లేపాక్షి తిలకిస్తారు. ఆ సందర్శన పిదప హాయిగా బెంగుళూరు, మైసూరు చూస్తారు.

ఇద్దరూ ట్రయిన్‌లో కిటికీ ముందు కూర్చుని తాము కదలిపోతూ, కదలికలేని పొలాలను, చెట్లను స్థలాలను కదలిపోతునట్లు తిలకిస్తున్నారు.

"స్వర్ణా! చిన్నతనంలో రైలు ప్రయాణం భలే తమాషాగా ఉంట్నుందికదోయ్. నిజంగానే చేమతో నిండిన పొలాలు, చెట్లుచేమలు, కొండలు, ఇళ్ళు అవే కదలిపోతునట్లు మనమే స్థిరముగా కదలకుండా ఉన్నట్లు అనిపిస్తుంది కదూ" అన్నాడు శ్యామ్. ఊ కొట్టి ఊరుకుంది స్వర్ణ.

శ్యామ్‌కి కొంత ఆశ్చర్యం కలిగింది. 'నిన్నతను ఆఫీసు నుండి వచ్చిన దగ్గర నుంచి స్వర్ణలో స్తబ్దత చూస్తున్నాడు. ఎంతో ఉత్సాహంతో ఆనందంగా పరవశిస్తున్న తలమునకలవుతున్న స్వర్ణ ఒక్కసారి ఇలా మారిపోయింది. ఈ సమయం కోసం చాలుగేండ్లుగా ఎన్ని కలలు కన్నది! తనకోరిక నెరవేరేంతవరకు అత్తగారి మాటను కూడా త్రోసిబుచ్చింది. మాతృత్వపు మాధుర్యాన్ని కూడా చవిచూడనని మంకు పట్టు పట్టింది. మరి ఇప్పుడు ఇలా నిస్తేజంగా ఉండిపోయిందేం? 'ఆలోచనలతో శ్యామ్‌కూడా మౌనం వహించేడు.




తొలి మజిలీ లేపాక్షిలో అడుగు పెట్టేరు. రూం తీసుకొని, విశ్రాంతిగా కొన్ని గంటలు గడిపాక చూడవలసిన ప్రదేశాలకు బయలుదేరారు.

శ్యామ్ తనకి కాపురానికి వచ్చిన రోజే కొనియిచ్చిన చిలకాకు పచ్చ వాయిలు చీర కట్టుకుంది. జడలో మల్లె చెండు తురుముకుంది. టాక్సీలో భర్త పక్కన కూర్చుంది. శ్యామ్ ఆమెకు అతి చేరువగా జరిగి, ఆమె జడలోని మల్లెల సుగంధాన్ని ఆఘ్రాణిస్తున్నాడు. 'హనీమూన్‌కి బయలు దేరిన దగ్గరనుంచి ఇతగాడి చిలిపితనం ఎంతని? ఆనందంలో హద్దులే మరచి పోతున్నాడు. పరిసరాలనీ, తమవైపే చూస్తున్న కొంటె కళ్ళనీ గమనించడేం? తను ముచ్చటపడ్డట్టు తొలినాటి మధురిమలనే చవిచూపిస్తున్నాడు. తనూ చెయ్యి కలిపి ఉంటే వలపు పల్లవించి ఉండేది. ఆ రోజు శ్యామ్ అన్నట్టు ముదిమి వయస్సులోకూడా మధురమైన జ్ఞాపకాలనే మిగిల్చిపెట్టేది ఈ హనీమూన్. కాని తనకిప్పుడు అది సాధ్యమా? శ్రీవారి కంట బడకుండా అప్పటి ఆ ఉత్తరాన్నైతే భద్రపరచగలిగింది. కాని ఆ విషయాన్ని తన మనస్సు నుంచి ఆవలికి నెట్టలేకపోతుంది!'

లేపాక్షిలో పవిత్రమైన దేవాలయాలు ఒకటొకటే చూస్తుంటే శ్యామ్ హృదయం భక్తితో పరవళ్ళు తొక్కింది. అక్కడి అపురూప శిల్ప సౌందర్యం అతడిని ముగ్ధుడిని చేస్తోంది. స్వర్ణలో మాత్రం ఏ భావం కనిపించలేదు. ఎందుకో కళతప్పి వెలవెలబోతున్నట్లు తోచింది ఆమె ముఖం.

"చూడు స్వర్ణా! ఇంత అపురూప శిల్పసృష్టి మన ఆంధ్రులదే అనుకున్నప్పుడు ఎంతో గర్వం కలుగుతుంది కదూ"

"అవును" అంది పొడిగా.

శ్యామ్ అయోమయస్థితిలో పడిపోయాడు స్వర్ణ ధోరణికి. 'ఏమిటిలా ఇన్ని అందాలు ఎదురుగా ఉన్నా, స్వర్ణ హృదయం స్పందించదేం? ఏ పార్కులోనో పూల మొక్కలమధ్య తామిద్దరమూ నించుంటే అదే ఓ బృందావనంలో అనుభూతి చెంది భావకవిత్వం ఒలక బోస్తుంది. ఇంతటి మహత్తర సౌందర్యాన్ని కళ్ళారా తిలకిస్తూ కూడా మనసారా పులకించ లేకపోతోంది. అంటే ఏదైనా బలమైన కారణం ఉండే ఉండాలి...'అతని మనస్సుకూడా అంతుపట్టని ఆలోచనల ఒత్తిడికి గురి అయింది.

రాత్రి పదిగంటలకి తిరిగి రూంకి వచ్చి ఎవరికి వారే అన్నట్టు నిద్రకు ఉపక్రమించారు. శ్యామ్ అయితే కాస్సేపటి తర్వాతనైనా నిద్రలోకి జారుకోగలిగేడు కాని, స్వర్ణకు కళ్ళు మూతలుపడలేదు.

'తను ఇంత ఆశించిన హనీమూన్ ట్రిప్ ఇలా అవుతోందేమిటి? ఆ ఉత్తరమే రాకపోయి ఉంటే ఆనందపుటంచుల శ్రీవారితో కలసి చూసేది. స్వర్గ సౌఖ్యాలు అందిన అనుభూతి తనను ఆవరించేది. ఎంత ప్రయత్నించినా సరదాగా గడపలేకపోతోంది. ఆ క్షణంలో ఎటూపాలుపోక ఆ ఉత్తరాన్ని దాచేసి బయలు దేరిందేకాని మరుక్షణం నుంచీ కలవరమే మిగిలింది. ఇలాసాగిన ఈ హనీమూన్ తీయని గుర్తుగా మిగులు తుందా? ఈ చేదు దాని వెంట వెనుకాలే తరుము కుంటూరాదూ? తను ఇలా చెయ్యకపోతేనే బాగుండే దేమో? నిజాన్ని కప్పిపుచ్చి తాను సాధిస్తున్న దేమిటి? పెద్ద లైన అత్తమామలకన్న తనకి విహారాలే ముఖ్యమా? ఒక వేళ జరగరానిదేమైనా జరిగితే...అమ్మో! ఆ తప్పిదం తనది కాదూ!' ఆలోచిస్తూనే మగత నిద్రలోకి జారు కుంది. తెల్లారగానే ఇంటికి వచ్చే ఉంటుంది. అత్తగారికి ఏమయిందో!..కలత నిద్రలోనే కెవ్వున కేకపెట్టింది.

శ్యామ్ అదిరిపడిలేచాడు.

"అదేం స్వర్ణా! ఏమయింది?" ఆమె మట్టా చేతులువేసాడు.

"కమ్మని కలల్లో తేలిపోవలసిన ఈ సమయంలో..."

"వద్దండీ! మనకు ఇంక ఏకాంతాలూవద్దు. వెళ్ళి పోదాం" అంటూ నిలువెల్లా కంపించిపోయింది.

"అరే! అలాగెందుకు పోతున్నావేం? నాకేమీ అర్థం కావడం లేదు. ముందు ఈ నీళ్ళు తాగు" గ్లాసు అందించాడు.

"మాబామ్మ చెప్పేదిలే! ఎంతో సంతోషంగా ఉన్న వాళ్ళు ఒక్కసారి దిగులుపడిపోయినా, ఇలా నిద్రలో వెర్రిమొర్రి అరుపులు అరచినా, భూతప్రేతపిశాచాలు ఆవరించినట్లేనని"

"అదేం కాదులెండి, నన్ను ఆవరించిన స్వార్థపిశాచం ఇప్పుడే వదిలేసింది. పదండి. మన ఊరు వెళ్ళిపోదాం." భర్త ఒడిలో తలదాచుకొని వెక్కి వెక్కి ఏడ్చింది.

అతని లాలనతో ఊరటపొంది, విషయం భర్త ముందు ఉంచింది.

"పిచ్చి స్వర్ణా! అందుకేనా ఇంతమూడీగా ఉన్నావు. నీలో మంచితనం, నిర్మలమైన మనస్సు నాకు తెలుసు. నువ్వన్నట్టే అమ్మ దగ్గరకు వెళ్దాం."

అత్తగారి సమక్షంలో తప్ప ఆమె మానసిక ఆందోళన మాయంకాలేదు. సెలవలు ఆవిడ సేవలోనే గడిపి తృప్తిగా నిట్టూర్చింది. కోడలు దాదాపు ఓనెల తమ దగ్గరే ఉన్నందుకు ఆవృద్ధ దంపతుల ఆనందానికి మేర లేదు.

శ్యామ్, స్వర్ణ బయలుదేరుతూ వాళ్ళకు పాదాభి వందనం చేశారు. ఆప్యాయంగా కోడల్ని కౌగలించుకొని "మనవడిని ఎప్పుడిస్తావు" అని అత్తగారు ఎప్పటిలానే అన్నా, స్వర్ణమాత్రం ఈ మారు మౌనం వహించలేదు.

"తొందరలోనే మీ కోరిక తీరుస్తా. ఇక మేం వచ్చేదిలేదు. పురుడికలు తీసుకొని కొద్దినెలల్లో మీరే వస్తారు"- బదులిచ్చింది.

ఆమాటకు తల్లి ముఖం ఎంత వికసించిందో శ్యామ్ మనస్సులో స్వర్ణపట్ల అంతటి అభిమానం ఇనుమడించింది.

'స్వర్ణ 'కోరిక' ఎంతట్లో ఎలా రూపాన్ని మార్చు కుంది' అనుకున్నాడు ఆమె పక్కన రిక్షాలో కూర్చుంటూ.

